సాక్షి బాపట్ల

గురువారం । 14 । నవంబర్ । 2024




భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

రాజుపాలెం: గ్రామంలోని జయంతి కాలనీ శ్రీవైష్ణవ హరిదాసుల సంఘం ఆధ్వర్యంలో మంగళ కైశిక ద్వాదశి నగర సంకీర్తన బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ: ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి తెనాలికి చెందిన బొర్రా రవికుమార్ కుటుంబం బుధవారం రూ. 1.21 లక్షల విరాళం అందజేసింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4709, హై లెవల్ కాలువకు 153 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

పల్నాటి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం



కారెంపూడి: పల్నాటి ఉత్సవాల నేపథ్యంలో సౌకర్యాల కల్పనకు బుధవారం శ్రీకారం చుట్టారు. జేసీబీతో ఉత్సవాల ప్రాంగణాన్ని శుభ్రం చేసే పనులు చేశారు. వీరాచారవంతులకు, ఇతరులకు వసతులు కల్పించాలనే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని టీడీపీ నాయకుడు పంగులూరి అంజయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్యాన్సర్ సర్వే



నరసరావుపేట: జిల్లాలో గురువారం నుంచి ఎన్‌సీడీసీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ అండ్ కమ్యూనికేబుల్ డిసీజెస్) సర్వేలో భాగంగా క్యాన్సర్‌పై ఇంటింట సర్వే నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి వ్యక్తుల వివరాలను నమోదు చేసుకుంటారన్నారు. 18 ఏళ్లు పైబడిన వారందరికీ రక్తం, బీపీ, మధుమేహం పరీక్షలు చేస్తారన్నారు. క్యాన్సర్ గురించి వివరించి ఒప్పుకున్న వారందరికీ ఎన్‌డీపీ (నేషనల్ డయాలసిస్ ప్రోగ్రామ్)కి తీసుకొచ్చి మహిళా డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పరీక్షలు చేస్తారన్నారు. వీరి ద్వారా సేకరించిన నివేదిక ద్వారా క్యాన్సర్‌కు గురైనట్లు అనుమానం ఉన్న వారిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళతారని తెలిపారు. వైద్యసిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ నెల 15న చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రాం ఉందని, దీనిని వైద్యఆరోగ్యశాఖ మంత్రి విజయవాడలో ప్రారంభిస్తారన్నారు. అంగన్వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.

సినీ నటుడు పోసానిపై టీడీపీ నేతల ఫిర్యాదు

బాపట్ల టౌన్: ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళీపై బాపట్లకు చెందిన పలువురు టీడీపీ నేతలు బుధవారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును పోసాని అసభ్య పదజాలంతో దూషించారని, కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు పోసానిపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని, దీనిపై ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పట్టణ పోలీసులు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ పార్లమెంట్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని, కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, విజయ్ కుమార్, జీవన్ తదితరులు ఉన్నారు.

కౌశల్ పోటీలకు దరఖాస్తు చేయండి



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు కౌశల్-2024 పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉందని పేర్కొన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె సంబంధిత పోస్టర్‌ను విడుదల చేశారు. పోటీలు క్విజ్, పోస్టర్ పెయింటింగ్ విభాగాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారని వివరించారు. విద్యార్థులను సమాయత్తం చేయాలని కోరారు. 87902 90997, 99590 04434 ఫోను నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పిడుగురాళ్లలో వర్షం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నిన్నటి వరకు తీవ్రంగా ఎండలు కాయటంతో అల్లాడిన ప్రజలు బుధవారం ఉదయం నుంచి ఎండ తక్కువగా ఉండటంతో కాస్త ఊరట చెందారు. సాయంత్రం 5 గంటల సమయంలో వర్షం పడటంతో మరింత ఉపశమనం పొందారు. రైతులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

తేలని వాటా... ప్రాణాలతో ఆట!

ఇంకొల్లు- పర్చూరు ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులిచ్చింది. కాంట్రాక్టరు 28 శాతం పనులు చేసి బిల్లుల కోసం వెళ్లారు. అధికారి అవినీతి దాహంతో విసిగి వెళ్లిపోయారు. మరోవైపు రూ. కోటి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే ఒకరు ఒత్తిడి పెంచడంతో పనులు నిలిపేశారు. సర్కారు తీరుతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

- అర్ధంతరంగా ఆగిన ఇంకొల్లు - పర్చూరు ప్రధాన రోడ్డు పనులు
- రూ.22 కోట్లు కేటాయించిన నాటి వైఎస్ జగన్ ప్రభుత్వం
- వాటాల గోలతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టరు
- కూటమి సర్కార్ పట్టించుకోక ప్రమాదాల్లో నిండు ప్రాణాలు బలి



అడుగడుగునా గుంతలతో ఇంకొల్లు - పర్చూరు రోడ్డు

సాక్షి ప్రతినిధి, బాపట్ల : ఇంకొల్లు-పర్చూరు (పాత మద్రాసు) రోడ్డు పనులు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడంతో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అయినా కూటమి ప్రభుత్వం మాత్రం పనులు ప్రారంభించే దిశగా ఆలోచించడం లేదు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేసింది. 19 కిలోమీటర్ల ఈ రోడ్డును 5.5 మీటర్ల నుంచి 7 మీటర్లకు వెడల్పు పెంచడంతోపాటు కొత్తగా బీటీ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. 2021 డిసెంబర్ 31న మిత్రా కంపెనీ పనులను అగ్రిమెంట్ చేసుకుంది. ఇంకొల్లులో సిమెంట్ రోడ్డు నిర్మాణంతోపాటు రహదారిలో ఉన్న కల్వర్టు పనులను దాదాపుగా పూర్తి చేశారు. మొత్తం రూ.4.50 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. ఈ పనులకు బిల్లులు ఇవ్వాలని కంపెనీ అప్పటి రోడ్లు భవనాల శాఖ అధికారిని కోరింది. తనకు పర్సంటేజీ ముందుగా చెల్లించాలని ఆ అధికారి సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. బిల్లులు అయ్యాక ఇస్తానని కాంట్రాక్టర్ చెప్పడంతో ఆ అధికారి విషయం నాన్చి పట్టించుకోలేదు. ఆ తర్వాత బదిలీపై వెళ్లిపోయారు. కాంట్రాక్టర్ కూడా పనులు నిలిపివేసినట్లు సమాచారం. తన నియోజకవర్గంలో పనులు చేస్తున్నందున రూ. కోటి కప్పం కట్టాలని ఒక మాజీ ఎమ్మెల్యే ఒత్తిడి పెంచడం కూడా పనులు నిలిచిపోవడానికి కారణమన్న ప్రచారం ఉంది.

కీలక రహదారే

అధికారులు మారారు. కూటమి సర్కార్ కొలువుదీరి ఆరు నెలలు కావస్తున్నా కనీసం ఈ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. దీంతో రహదారి మరింత అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ఫోర్ వీలర్స్ సంగతి దేవుడెరుగు.. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లేందుకు కూడా చాలా కష్టంగా ఉంది. దారిలో ఇంకొల్లు మొదలు ఇడుపులపాడు, వంకాయలపాడు, దగ్గుపాడు, నూతలపాడు, ఎర్రగుంటపాలెం, పర్చూరు తోపాటు పలు గ్రామాలున్నాయి. అటు పర్చూరు నుంచి చిలుకలూరిపేట, గుంటూరు, విజయవాడ తోపాటు పల్నాడు జిల్లా మీదుగా హైదరాబాద్‌కు ... ఇటు ఇంకొల్లు నుంచి చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారి మీదుగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు, చెన్నైకి ఈ మార్గంలో వెళ్లవచ్చు. దీనిని పాత మద్రాసు రోడ్డుగా కూడా పిలుస్తారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఇటుగా ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తాల్సి వస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో తరచూ ప్రమాదాల వల్ల ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల ఓ దుర్ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించారు.

కొత్త అంచనాలు అవసరం

కొత్త అంచనాలతో పనులు చేపట్టాల్సి ఉంటుందని రోడ్లు భవనాల శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాంట్రాక్టరుతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు భవనం శ్రీనివాసరెడ్డి బుధవారం రోడ్లు భవనాల శాఖ డీఈ, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని కోరారు. త్వరలో రోడ్లు భవనాల శాఖ సీఈ రహదారిని పరిశీలిస్తారని, ఆయన సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని జేఈ శ్రీకాంత్ చెప్పారు. వీలైనంత త్వరగా పనులు మొదలు పెడతామని ఆయన తెలిపారు.

పనులు వెంటనే చేపట్టాలి



ఇంకొల్లు- పర్చూరు రహదారి నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ. 22 కోట్లు ఇచ్చింది. 28 శాతం పనులు పూర్తయ్యాయి. అప్పటి అధికారులు సకాలంలో పనులు పూర్తి చేయించలేదు. రోడ్డు మరింతగా దెబ్బతినడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలి. లేకపోతే ప్రజలతో కలిసి ఉద్యమించాల్సి వస్తుంది.

– భవనం శ్రీలక్ష్మి, జడ్పీటీసీ, ఇంకొల్లు

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

- కార్పొరేట్ శక్తులను పెంచి పోషించడమే చంద్రబాబు నైజం
- బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున

రేపల్లె రూరల్: ప్రజా సంక్షేమమే తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమైతే.. కార్పొరేట్ శక్తులను పెంచి పోషించటం చంద్రబాబు నైజమని బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై శ్రేణుల్లో, ప్రజల్లో ఉన్న అభిమానం ఏ మాత్రం తగ్గలేదని సమావేశానికి హాజరైన జనసందోహాన్ని చూస్తేనే తెలుస్తోందన్నారు. కూటమి పార్టీలు కుటిల రాజకీయాలతో అధికారంలోకి వచ్చాయన్నారు. కక్ష సాధింపులే లక్ష్యంగా పాలిస్తున్నాయని మండిపడ్డారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కుతూ అక్రమ కేసులు బనాయిస్తూ రాక్షసానందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని కేసులు పెట్టినా శ్రేణులు భయపడబోవన్నారు. అందరికీ భరోసా ఇచ్చేందుకు త్వరలో అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీలకు నిధులు కేటాయించకపోవటం శోచనీయం అన్నారు. ఊరూరా బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ చంద్రబాబు మహిళల ఉసురు పోసుకుంటున్నారని పేర్కొన్నారు. డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తకు వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చూడాలన్నదే లక్ష్యం కావాలన్నారు. జమిలి ఎన్నికలు వస్తాయని, టీడీపీ పాలనపై వ్యతిరేకతతో ఉన్న ప్రజలు జగన్‌కు పట్టం కట్టడం ఖాయం అని చెప్పారు. వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. జగనన్న రాష్ట్రాన్ని విద్యాంధ్రప్రదేశ్‌గా మార్చితే, చంద్రబాబు 'మద్యాం'ధ్రప్రదేశ్‌గా మార్చుతున్నారని పేర్కొన్నారు. హామీలపై ప్రశ్నిస్తున్న జగనన్న సైనికులను అక్రమ కేసులతో ఇబ్బంది పెడుతున్నారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, నేతలు యార్లగడ్డ మదన్‌మోహన్, బొర్రా శ్రీనివాసరావు, పట్టెం శ్రీనివాసరావు, చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, కాటూరి శివనాగబాబు, చదలవాడ శ్రీనివాసరావు, సజ్జా పద్మావతి, కరేటి శేషగిరి, కృష్ణారెడ్డి, షేక్ అబ్దుల్ ఖుద్దూష్, కామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున. వేదికపై డాక్టర్ ఈవూరు గణేష్, వరికూటి తదితరులు

చదరంగంలో చిచ్చరపిడుగే!

పద్నాలుగు ఏళ్లకే చెస్‌లో రాణిస్తున్న అజయ్ సంతోష్

చినగంజాం: చిన్నవయస్సులో అసాధారణమైన ప్రతిభతో చెస్‌లో రాణిస్తున్నాడీ బాలుడు. చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పర్వతరెడ్డి కాంతారావు మనుమడు అజయ్ సంతోష్ తనదైన శైలిలో చదరంగంలో విజయాలు సొంతం చేసుకుంటున్నాడు. బాలుడి తల్లిదండ్రులు మయూర్, సంధ్యారాణి. తండ్రి ఉద్యోగ రీత్యా ఢిల్లీలో ఉంటున్నారు. అజయ్ ప్రస్తుతం వారణాసిలో 9వ తరగతి చదువుతున్నాడు. 8వ ఏట నుంచే చదరంగం ఆడుతున్నాడు. ఇప్పటికే 3 బంగారు, 2 వెండి పతకాలు సాధించాడు. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సైతం అందుకున్నాడు. ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ ఇచ్చే ర్యాంకింగ్‌కు సంబంధించి ఈఎల్‌ఓ రేటింగ్ సెప్టెంబర్ నాటికి 2346తో ఉన్నాడు. ఏకాగ్రత అతని విజయాలకు పునాది.



శ్రీలంకలో కామన్‌వెల్త్ చెస్ ఛాంపియన్‌షిప్ అవార్డు స్వీకరిస్తున్న అజయ్ సంతోష్ (ఫైల్)

సాధించిన విజయాలు ఇవీ...

- వరుసగా రెండు సంవత్సరాలపాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ ఛాంపియన్ షిప్‌లో మొదటి ఐదు స్థానాలలో నిలిచి స్థిరమైన ర్యాంక్ సాధించాడు.
- శ్రీలంకలో నిర్వహించిన కామన్‌వెల్త్ యూత్ ఛాంపియన్‌షిప్ 2024 అండర్ -18 ఓపెన్, బ్లిట్జ్ విభాగంలో రెండు బంగారు పతకాలు, ఒక వెండి మెడల్ సాధించాడు.
- 30వ అబుదాబి ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్‌లో అండర్ 14 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు.
- స్లోవేకియాలోని పియస్టనీ ఓపెన్‌లో ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ 2400 ప్లస్ ఈఎల్‌ఓ లైవ్ రేటింగ్‌ను సాధించడం ద్వారా మొదట ఇండియన్ మాస్టర్ సాధించాడు.
- కజికిస్తాన్‌లోని అల్మటిలో ఏషియన్ యూత్ ఛాంపియన్‌షిప్ 2024 టీంకు ప్రాతినిధ్యం వహించి ఓపెన్, ర్యాపిడ్ విభాగాల్లో జట్టు సిల్వర్ మెడల్ సాధించేందుకు దోహదపడ్డాడు.
- తమిళనాడులోని చెన్నైలో నిర్వహించిన 6వ తమిళనాడు ఇండియన్ మాస్టర్ ఈవెంట్‌లో మూడో స్థానం సాధించాడు.
- జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లోని నిర్వహించిన ఏషియన్ జూనియర్ ఛాంపియన్ షిప్ 2023లో 8వ స్థానం సాధించాడు.
- పంజాబ్‌లోని జలంధర్‌లో అండర్- 17 విభాగంలో నిర్వహించిన నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్ 2023లో సిల్వర్ మెడల్ సాధించాడు.
- ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో అండర్ 19 ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర చెస్ ఛాంపియన్ షిప్ 2023-24 పోటీల్లో విజయం సాధించాడు.
- 2023లో పంజాబ్‌లోని సంగ్రూర్‌లో నిర్వహించిన నేషనల్ అమెచ్యూర్ చెస్ ఛాంపియన్ షిప్ విభాగంలో 2300 కంటే తక్కువ కేటగిరీలో 5వ ర్యాంక్ సాధించాడు.
- ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో 2023లో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిడే రేటెడ్ చెస్ టోర్నమెంట్ విజయం సాధించాడు.
- పన్నెండు సంవత్సరాల వయస్సులో చెస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు ఉత్తరప్రదేశ్ చెస్ ఛాంపియన్‌షిప్ వారిచే ఓఎస్‌ఐఆర్ అవార్డు 2023 అందుకున్నాడు.
- ఉత్తర ప్రదేశ్‌లోని కౌశంబీలో సీనియర్ స్టేట్ చెస్ ఛాంపియన్ 2022 నందు మొదటి స్థానాన్ని సాధించాడు.
- 2022లో ఉత్తర ప్రదేశ్‌లో చలో ఒలింపియాడ్ సెలక్షన్స్ అండర్ 15 విభాగంలో గెలిచి 9 రౌండ్లకు 9 రౌండ్లు స్కోర్ సాధించాడు.
- ఎనిమిదేళ్ల వయస్సులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో నిర్వహించిన చెస్ పోటీలో 5 రౌండ్లకు 5 రౌండ్లు ర్యాంకులు గెలిచి ఇంటర్ స్కూల్ చెస్ ఛాంపియన్ షిప్ అందుకున్నాడు.
- చెస్‌లో అత్యంత వేగవంతమైన ఆటను ఆడుతూ ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ ప్రకారం 2019 ఫిబ్రవరిలో 1120 రేటింగ్ ఉన్న అజయ్ సంతోష్ అదే ఏడాది చివరి నాటికి తన రేటింగ్‌ను 1573కు పెంచుకోగలిగాడు.
- తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో నిర్వహించిన వరల్డ్ ఒలింపియాడ్ చెస్ పోటీలకు అబ్జర్వర్‌గా ఎంపికయిన సంతోష్ మూడు రోజులపాటు విశ్వనాథన్ ఆనంద్ లాంటి గొప్ప ఆటగాళ్లతో గడిపాడు.
- గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన అండర్ - 9 నేషనల్స్ 2019లో 12 వ స్థానాన్ని సాధించాడు.
- యూఏఈ నం.1 చెస్ ఆటగాడు గ్రాండ్ మాస్టర్ సలెం సలెహ్, గ్రాండ్ మాస్టర్ పాంట్సులాయా లెవాన్‌ల వంటి బలమైన ప్రత్యర్థులతో ఆడి డ్రాగా నిలిచాడు.
- గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానందాతో సీమోల్ ఎగ్జిబిషన్ ఢిల్లీ ఇంటర్నేషనల్ ఓపెన్ - 2019లో తలపడిన పోటీలో డ్రా చేసుకున్నాడు.



తాను గెలిచిన పతకాలతో..

ల్యాండ్ బ్యాంక్ కోసం భూమిని గుర్తించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ల్యాండ్ బ్యాంక్ కోసం భూమిని గుర్తించి తహసీల్దార్లు నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. ల్యాండ్ బ్యాంక్, శ్మశాన భూముల సమస్య, ఎస్టీలకు ఆధార్ జారీ ప్రక్రియపై రెవెన్యూ అధికారులతో బుధవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఖాళీ భూములను సంరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని చెప్పారు. అభివృద్ధికి వాటిని వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పెట్రోల్ బంకులు వంటివి రెవెన్యూ ఆధీనంలోనే ఉండేలా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం 203.63 ఎకరాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉన్నట్లు ఆర్డీవో పి గ్లోరియా వివరించారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో 98, చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో 90.38 ఎకరాలున్నట్లు ప్రాథమికంగా నివేదిక అందించారు. పది రోజుల్లో పూర్తి వివరాలను ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఖాళీ భూములు లేవని చెప్పిన ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలిస్తామన్నారు. ఆ సమయంలో ఖాళీ భూములు కనిపిస్తే సంబంధిత మండలాల్లోని రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆధార్ కార్డులు లేని ఎస్టీలకు యుద్ధ ప్రాతిపదికన ఇప్పించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మండలానికి మూడు ఎస్టీ కుటుంబాలను దత్తత తీసుకుని పథకాలను వారికి వర్తింపజేయాలన్నారు. తీర ప్రాంతాలలో మడ అడవులను సంరక్షించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన భూములు లేవనే ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేటాయించాలన్నారు. శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియ గడువు ఈ నెల 20వ తేదీలోగా వచ్చిన దరఖాస్తుల విచారణ సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఇసుక, బుసక, గ్రావెల్‌లను యంత్రాలతో తవ్వడానికి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఇసుక తవ్వకాలకు ఎద్దుల బండి, ట్రాక్టర్లకు మాత్రమే అనుమతులు ఇచ్చామని చెప్పారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, మండలాల నుంచి తహసీల్దార్లు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల పాత్ర కీలకం

వికసిత్ భారత్‌లో సహకార సంఘాల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. 71వ జాతీయ సహకార వారోత్సవాల వాల్ పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లా సహకార అధికారి సీహెచ్ సంసోన్, కాటసాని తిరుపాల్ రెడ్డి, అధికారులు మరకా రవికుమార్, గోగుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వసతులు కల్పించాలి

అంగన్వాడీ కేంద్రాలకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు తప్పనిసరిగా కల్పించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. దీనిపై అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ చాంబర్లో బుధవారం ఆయన సమీక్షించారు. తాగునీరు లేని కేంద్రాలు జిల్లాలో 458, మరుగుదొడ్లు లేనివి 190 ఉన్నాయన్నారు. అభివృద్ధి పనులకు రూ.77.86 లక్షల నిధులు విడుదలయ్యాయని వివరించారు. నిధుల కొరతపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నివేదించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఆయా పంచాయతీల అనుసంధానంతో అంగన్వాడీ కేంద్రాలలో తాగునీరు అందించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

రిసార్ట్స్‌కు వచ్చే వారి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలి

చీరాల: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని తీర ప్రాంతంలోని రిసార్ట్స్ యజమానులతో బుధవారం స్థానిక కొత్తపేటలోని కళ్యాణ మండపంలో చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్ సమావేశాన్ని నిర్వహించారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా తీర ప్రాంతాలకు సుదూర ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారన్నారు. రిసార్ట్స్‌కు వచ్చే వారి పూర్తి వివరాలను, వారి ధ్రువపత్రాలను తీసుకోవాలన్నారు. రిసార్ట్స్ వద్ద ఏమైనా జరిగితే ఆ బాధ్యత యాజమాన్యాలదే అన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. అలానే కార్తిక పౌర్ణమి సందర్భంగా చీరాల తీర ప్రాంతంలో పరిశీలించి భక్తులకు కావాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. సముద్ర స్నానం చేసే వారు లోతుకు వెళ్ళకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బీచ్‌లలో గజ ఈతగాళ్ళకు సూచనలు, సలహాలు ఇచ్చారు.



రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాల ఆందోళన

న్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే కుమారుడి హామీతో విరమణ



బాధితుల ఆందోళనతో స్తంభించిన రాకపోకలు



మృతుల ఫొటోలతో విలపిస్తున్న కుటుంబసభ్యులు

బాపట్ల టౌన్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు చెందిన రాయల్ మెరైన్ కంపెనీ కంటైనర్ మంగళవారం వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టడంతో కర్లపాలెం మండలంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్లపాలెం ఐలాండ్ సెంటర్ గిరిజనులతో కలిసి బుధవారం బాధిత కుటుంబాలు ఆందోళనకు దిగాయి. ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షల నగదు, పిల్లల చదువు ఖర్చు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర వచ్చి ఆందోళన విరమించాలని వారిని కోరారు. కానీ స్పందించకపోవడంతో రూరల్ సీఐ హరికృష్ణ, డీఎస్పీ రామాంజనేయులు వచ్చి వారితో చర్చించారు. అయినప్పటికీ మాట వినలేదు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయం వెళ్లింది. ఆయన సూచన మేరకు కుమారుడు వచ్చి హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.